క్లుప్తంగా

ప్రాథమిక పాఠశాలకు బీరువా అందజేత



గొల్లగూడెం పాఠశాలకు ఇనుప బీరువా అందజేసిన కాగిత భాస్కరరావు

దేవరపల్లి: మండలంలోని గొల్లగూడెం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు అదే గ్రామంలోని లగడపాటి రామలక్ష్మమ్మ, రామానాయుడు దివ్యాంగుల,వృద్ధాశ్రమం వ్యవస్థాపక అధ్యక్షుడు కాగిత భాస్కరరావు శనివారం ఇనుప బీరువా అందజేశారు. తన తండ్రి డేవిడ్ వర్థంతి సందర్భంగా పాఠశాలకు రూ.12 వేల విలువైన బీరువాతో పాటు విద్యార్థులకు నోట్ బుక్స్, కలర్ పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మాధవరపు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు, ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

రోగులకు 'మానవత' ఆర్థిక సాయం

నల్లజర్ల: మండలంలోని పోతినీడుపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురికి ఒక్కొక్కరికి రూ.4 వేల చొప్పున మొత్తం రూ.12 వేలు మానవత సంస్థ మండలశాఖ శనివారం ఆర్థిక సాయం చేసింది. గంజి అనసూయ, అరిగర ఉషాకిరణ్, నాయుడు బుజ్జమ్మ అనే లక్ష్మీకాంతంలకు ఈ మొత్తాన్ని అందజేశారు. కార్యక్రమంలో మానవత సంస్థ సభ్యులు ఐడీవీ అప్పారావు, గుళ్ళపూడి వెంకటరత్నం, పాతూరి రమేష్, ఆలపాటి సత్యనారాయణ, సర్పంచ్ పిచ్చుకుల గణపతి తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశా.. గోవిందా..



విశేష అలంకరణలో వేంకటేశ్వరస్వామి,అమ్మవార్లు

పెరవలి: అన్నవరప్పాడులో కొలువైన వేంకటేశ్వరస్వామి వారి దర్శనానికి శనివారం భారీఎత్తున భక్తులు తరలి వచ్చారు. స్వామివారి దర్శనానికి గంట సమయం పట్టింది. స్వామివారికి వందలాది మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. దాతల సహాయంతో సుమారు 5 వేల మందికి అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి మీసాల రాధాకృష్ణ మాట్లాడుతూ దాతల సహకారంతో ప్రతి శనివారం భక్తులకు అన్న సమారాధన నిర్వహిస్తున్నామని తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు



పెంద్రాల వీరయ్య

నిడదవోలు: మండలంలోని సింగవరానికి చెందిన పెంద్రాల వీరయ్య (51) అదృశ్యంపై శనివారం పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. మానసిక పరిస్థితి సరిగా లేక వీరయ్య ఇంట్లో అప్పుడపుడూ గొడవలు పడుతుండేవాడు. ఇదే క్రమంలో వీరయ్య గొడవ పడి ఈనెల 5న ఇంటి నుంచి వెళ్లిపోయాడు. అప్పటి నుంచీ ఇంటికి రాకపోవడంతో బంధువుల ఇంటిదగ్గర వెతికినప్పటికీ అతడి ఆచూకీ దొరకలేదు. వీరయ్య భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ ఎస్సై శోభన్‌కుమార్ తెలిపారు. వీరయ్య సమాచారం తెలిసిన వారు 94407 96660 నంబర్‌కు తెలపాలని ఎస్సై కోరారు.

ప్రజా సేవలకు సెలవేనా..?

- సచివాలయాల సేవలను కుదిస్తున్న కూటమి ప్రభుత్వం
- నేటికీ తెరచుకోని ప్రభుత్వ వెబ్ సైట్లు
- రేషన్‌కార్డులు, ఇళ్ల స్థలాలకు దరఖాస్తు చేసుకునే దారేదీ?
- సామాన్యుల్లో పెరుగుతున్న అసంతృప్తి



కలవలపల్లిలో గ్రామసచివాలయం

చాగల్లు: మహాత్మా గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం స్థాపనే లక్ష్యంగా మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పల్లెల అభివృద్ధికి పెద్దపీట వేశారు. ప్రజల వద్దకే పాలనే ధ్యేయంగా గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేశారు. మండల కేంద్రాలకు వెళ్లకుండా ఉన్న గ్రామాల్లోనే సచివాలయాల్లో అన్ని సేవలూ అందేలా చర్యలు తీసుకుంది గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం. అయితే అంతకంటే మిన్నగా ప్రజల వద్దకే పాలన సాగిస్తామంటూ కల్లబొల్లి హామీలతో గద్దెనెక్కిన టీడీపీ కూటమి ప్రభుత్వం సచివాలయ సేవలకు తూట్లు పొడుస్తోంది. ప్రజా సేవలకు కోత విధిస్తోంది. ప్రజలకు మరింతగా అవసరమైన రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డులు, రైతు భరోసా వంటి వాటి వెబ్‌సైట్లు ఇప్పటికీ ఓపెన్ కాలేదు. ప్రజా సేవలను వరుసగా తగ్గిస్తోంది. పౌరులు ప్రస్తుతం కేవలం కుల,ఆదాయ, వన్ బీ వంటి సాధారణ సేవలను మాత్రమే పొందుతున్నారు. దీంతో అన్నివర్గాల ప్రజలూ కూటమి ప్రభుత్వం తీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు. సచివాలయాల సేవలను టీడీపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో పల్లెల్లోనే సేవలు అందజేసేందుకు ప్రతి గ్రామంలోనూ సచివాలయాన్ని ఏర్పాటు చేశారు. సచివాలయాలకు అనుసంధానంగా 50 గృహాలకు ఒక వలంటీరును నియమించి అన్ని సేవలనూ ప్రజలకు నేరుగా అందించారు. ఇందులో భాగంగా చాగల్లు మండలంలో 18 గ్రామ సచివాలయాలు ఏర్పాటయ్యాయి. 185 మంది ఉద్యోగులను నియమించారు. ఒక్కో సచివాలయ భవనాన్ని రూ.45 లక్షలు వెచ్చించి నిర్మించారు. ప్రజలు తమకు వీలున్నపుడే సమస్యలు విన్నవించుకుందుకు సచివాలయాలు ఎంతో ఉపయోగపడ్డాయి. సంక్షేమ పథకాలతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్, విద్యుత్ అనుసంధాన సేవలు, వివిధ ధ్రువపత్రాలు, ఆస్తుల రిజిస్ట్రేషన్ వంటి ఎన్నోరకాలు, ఎంతో ఉపయోగకరమైన సేవలను పల్లెల్లోనే పొందేవారు గ్రామీణులు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో ఈ సేవలు ప్రశ్నార్థకంగా మారాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సచివాలయాలు వెలవెలబోతున్నాయి. ఇప్పటికే వలంటీర్ల వ్యవస్థను పక్కనపెట్టిన టీడీపీ ప్రభుత్వం సచివాలయాల సేవలను తగ్గిస్తున్న తీరును ప్రజలు తప్పుపడుతున్నారు. సచివాలయ సేవలను యథావిధిగా కొనసాగించాలని అన్ని వర్గాల ప్రజలు కోరుతున్నారు.

రైస్ కార్డు దరఖాస్తులు ఎక్కడివ్వాలి?



ఒకప్పుడు ఏవైనా పనులు కావాలంటే సచివాలయంలో పొందేవాళ్లం. ఇప్పుడు ఏవైనా పథకాలు కావాలంటే ఏమి చేయాలో... ఎవరిని అడగాలో తెలియడం లేదు. రైస్ కార్డు కోసం ఎవరిని అడిగినా తమకేమీ తెలియదు అంటున్నారు. కనీసం ఎక్కడా సమాచారం చెప్పడం లేదు. ప్రభుత్వం పట్టించుకోకపోతే రైస్ కార్డుకు దరఖాస్తులు ఎవరికి ఇవ్వాలి.

– అయినం నాగరాజు, కలవలపల్లి

పల్లెల్లో సేవలు కొనసాగించాలి



గ్రామాల్లో ఏర్పాటైన సచివాలయాలతో గత ప్రభుత్వంలో ప్రజలకు విస్తృతమైన సేవలు అందేవి. గత ప్రభుత్వం మాదిరిగానే ఇప్పుడు కూడా గ్రామీణ ప్రాంతాలలో ప్రభుత్వ సేవలను సచివాలయాల ద్వారా కొనసాగించాలి. పల్లె ప్రజలకు స్థానికంగా పథకాలను అందించి, ఎక్కడికి అక్కడ వారి సమస్యలను పరిష్కరించడం అనేది మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం.

– ప్రత్తిపాటి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ, బ్రాహ్మణగూడెం

వెబ్‌సైట్లు ఓపెన్ చేయాలి



గ్రామ సచివాలయ, వలంటీర్ల సేవలను కొనసాగించాలి. ప్రభుత్వం ఏర్పాటై నాలుగు నెలలు ముగిసినా ప్రజలకు ఎలాంటి పథకాలూ అందడం లేదు. పేదలకు ఇది దారుణమైన పరిస్థితి. రైస్‌కార్డులతో పాటు, పింఛన్ దరఖాస్తుల వెబ్‌సైట్లు ఓపెన్ చేసి ప్రజలకు సేవలను అందించాలి. గ్రామీణ ప్రాంత ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలి.

– మేకా రాజు, ఉప సర్పంచ్, చాగల్లు

పొగాకు బోర్డు ఆధ్వర్యంలో వన మహోత్సవం



కొత్తగూడెంలో మొక్క నాటుతున్న పొగాకు బోర్డు అధికారులు, రైతులు

దేవరపల్లి: స్థానిక పొగాకు వేలం కేంద్రం పరిధిలోని కొత్తగూడెంలో పొగాకు బోర్డు ఆధ్వర్యంలో శనివారం మొక్కలు నాటారు. ఈ ఏడాది పొగాకు బోర్డు కొత్తగూడెం గ్రామాన్ని ఆదర్శ క్షేత్రంగా ఎంపిక చేసింది. గ్రామంలోని పొగాకు రైతులకు బోర్డు ద్వారా వేలం నిర్వహణాధికారి పి. హేమస్మిత మొక్కలు పంపిణీ చేశారు. ఒకొక్క రైతుకు నేరేడు, జామ, చింత, నిమ్మ, వెలగ, ఉసిరి వంటి పలు రకాలను 10 మొక్కల చొప్పున పంపిణీ చేశారు. ప్రాథమిక పాఠశాలలు, చెరువు గట్లపై మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో రైతులు, గ్రామస్తులు, వేలం కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

యూత్ రెడ్‌క్రాస్‌పై విద్యార్థులకు అవగాహన



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ మహాలక్ష్మి

కొవ్వూరు: విద్యార్థులంతా యూత్ రెడ్‌క్రాస్ సొసైటీలో చేరి సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలని రెడ్‌క్రాస్ సొసైటీ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యురాలు డాక్టర్ జీఎస్‌వీఏబీఎస్ మహాలక్ష్మి సూచించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీపై శనివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ సంస్థ చేస్తున్న సేవా కార్యక్రమాల గురించి వివరించారు. సంస్థ మౌలిక సూత్రాలైన మానవత్వం, నిష్పాక్షికత, తటస్థత, స్వతంత్రత, స్వచ్ఛంద సేవల గురించి ఆమె వివరించారు. ప్రిన్సిపల్ జె.సునీత, ఎన్ఎస్ఎస్ కళాశాల యూనిట్ సమన్వయకర్త మాదర్ సాహెబ్, అధ్యాపకులు సూర్యనారాయణ, రాజేశ్వరరావు, అప్పల నరసింహం, పుష్పాంజలి తదితరులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లుల్లో ఆర్డీవో తనిఖీలు



ఎస్.ముప్పవరంలో రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత

చాగల్లు: రైతుల వద్ద నుంచి ఖరీఫ్ ధాన్యం సేకరణకు రైస్‌మిల్లర్లు సిద్ధంగా ఉండాలని కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత అన్నారు. మండలంలోని చాగల్లు, ఎస్.ముప్పవరం గ్రామాల్లోని రైస్ మిల్లులను శనివారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు సమయంలో రైతులకు ఇబ్బందులు కలగకుండా సహకారం అందించాలన్నారు. నిబంధనల మేరకు ధాన్యం సేకరణ జరపాలన్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా మండలంలో రైస్‌మిల్లులను తనిఖీ చేసినట్టు ఆర్డీవో తెలిపారు. ఆర్డీవో వెంట సివిల్ సప్లయిస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు మరమ్మతులకు శంకుస్థాపన

కొవ్వూరు: స్థానిక బస్టాండ్ సెంటర్ నుంచి మెరక వీధి వాటర్ ట్యాంకు జంక్షన్ వరకూ గోతులమయంగా ఉన్న రోడ్డు మరమ్మతు పనులను ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు శనివారం ప్రారంభించారు. మున్సిపల్ సాధారణ నిధులు రూ.10 లక్షలు వెచ్చించి ఈ మరమ్మత్తులు చేపడుతున్నట్టు తెలిపారు. మున్సిపల్ చైర్ పర్సన్ బావన రత్నకుమారితో కలిసి ముందుగా పూజ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణ, మాజీ మునిసిపల్ మాజీ చైర్మన్ సూరపనేని చిన్ని, కమిషనర్ టి.నాగేంద్రకుమార్, సూర్యదేవర రంజిత్, పెనుమాక జయరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ స్టాక్ పాయింట్లపై చర్యలు

నిడదవోలు రూరల్: మండలంలోని పందలపర్రు, పెండ్యాల ఇసుక ర్యాంపులను నిడదవోలు సీఐ బాలగంగాధర్ తిలక్ శనివారం పరిశీలించారు. ఉచిత ఇసుక అమలు, స్టాక్ పాయింట్ల నిర్వహణ, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బుకింగ్ వివరాలను ఆయన పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇసుక ర్యాంపుల నిర్వహణ జరిగేలా చర్యలు చేపడతామని చెప్పారు. అక్రమంగా ఎవరైనా ఇసుక స్టాక్ పాయింట్లు ఏర్పాటు చేస్తే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ తిలక్ తెలిపారు. సమిశ్రగూడెం ఎస్సై కె.వీరబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

సహాయకులు సంధానకర్తలు కావాలి

- డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన యూనివర్సిటీ విస్తరణ సంచాలకుడు గోవిందరాజులు
- డివిజన్‌లోని వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు ఒక రోజు శిక్షణ



సదస్సులో మాట్లాడుతున్న యూనివర్సిటీ విస్తరణ సంచాలకుడు గోవిందరాజులు

నల్లజర్ల: రైతు సేవా కేంద్రాల్లో పని చేస్తున్న వ్యవసాయ, ఉద్యాన శాఖల సహాయకులు రైతులకు, ప్రభుత్వానికి మధ్య వారధిలా పని చేయాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకుడు డాక్టరు వి.గోవిందరాజులు సూచించారు. కొవ్వూరు డివిజన్‌లోని 9 మండలాల వ్యవసాయ, ఉద్యాన సహాయకులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని శనివారం తెలికిచెర్ల పంచాయతీ శివారువెంకట్రామన్నగూడెంలోని యూనివర్సిటీ ప్రాంగణంలో నిర్వహించారు. గోవిందరాజులు మాట్లాడుతూ వివిధ మార్గాల ద్వారా సేకరించిన సమాచారాన్ని ఎప్పటికపుడు రైతులకు అందించాలన్నారు. ఆధునిక వ్యవసాయంలో యంత్ర పరికరాలు, డ్రోన్ వంటి వాటి వినియోగం పెరిగిందన్నారు. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త వి.దీప్తి మాట్లాడుతూ కేవీకేల ద్వారా వ్యవసాయ, ఉద్యాన, పశుపోషణ, మత్స్యశాఖల సిబ్బందికి నూతన వంగడాలు, విధి విధానాలపై అవగాహన, క్షేత్రస్థాయి ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. శాస్త్రవేత్త డాక్టరు శేషకిరణ్ కొబ్బరి, ఆయిల్‌పామ్‌లకు సోకే ప్రాథమిక తెగుళ్లు, వాటి యాజమాన్య పద్ధతులను వివరించారు. సమగ్ర సస్యరక్షణ ప్రాధాన్యత, జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా పంటలకు హాని చేసే పురుగుల నివారణ గురించి ఏరువాక కేంద్ర కో–ఆర్డినేటర్ సీహెచ్‌వీ నరసింహారావు వివరించారు.కేవికే శాస్త్రవేత్త డాక్టర్ శేషకుమారి, ఏరువాక కేంద్ర ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు పలు విషయాలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ ఎస్.జయరామలక్ష్మి, కొవ్వూరు ఏడీఏ పి.చంద్రశేఖర్, మండల వ్యవసాయాధికారులు రాజారావు, కమల్‌రాజ్, సత్యనారాయణ, విశ్వాసరావు, మేరీకిరణ్, విజయ్, వెంకన్నబాబు ఉద్యానశాఖాధికారులు బబిత, శ్రీనివాస్, ఎంపీఈఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

పౌరులకు ఇబ్బంది కలగకుండా పని చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ యల్లారేశ్వరి

ఉండ్రాజవరం: పౌరులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి సూచించారు. సాధారణ బదిలీల్లో భాగంగా మండలానికి వచ్చిన అధికారులు, పంచాయతీ కార్యదర్శులతో శనివారం ఆమె స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఎంపీపీ యల్లారేశ్వరి మాట్లాడుతూ నాయకులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తూ మండలాభివృద్ధికి దోహద పడాలన్నారు. విలేజ్ న్యూట్రిషన్ కార్యక్రమంలో భాగంగా ప్రతి గ్రామంలోనూ కాయగూరల పెంపకానికి అనువైన సుమారు 10 సెంట్ల వ్యవసాయ భూమి ఏర్పాటు చేసుకోవాలన్నారు. తద్వారా అంగన్‌వాడీ కేంద్రాల్లోని బాలింతలు, చిన్నారులకు మరింత బలవర్థకమైన ఆహారాన్ని అందించే అవకాశం ఉంటుందన్నారు. సమావేశంలో ఎంపీడీవో వి.రామారావు, తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, ఈవోపీఆర్డీ శర్మ, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.2.56 లక్షల ఉపాధి నిధుల రికవరీకి ఆదేశం



ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీ ప్రజావేదికలో మాట్లాడుతున్న నాగమల్లేశ్వరరావు

- మండల స్థాయి సామాజిక తనిఖీలో గుర్తించిన అధికారులు
- మరో 5.82 లక్షల విలువైన పనులపై మళ్లీ విచారణ

గోపాలపురం: మండలంలో నిర్వహించిన ఉపాధి హామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, సిబ్బంది అవకతవకలకు పాల్పడినట్టు అధికారులు గుర్తించారు. మండల స్థాయి సామాజిక తనిఖీ ప్రజావేదికను శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. డ్వామా పీడీ కె.నాగమల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ ప్రజావేదిక జరిగింది. 2023–24 సంవత్సరంలో మండలంలోని 18 పంచాయతీల పరిధిలో ఉపాధి హామీ, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 988 పనులపై సామాజిక తనిఖీ జరిపారు. ఈ పనుల కోసం రూ.కోటీ 33 లక్షలు ఖర్చు చేశారు. ఈ పనులపై తనిఖీ బృందాలు జరిపిన విచారణలో 206 పనుల్లో కొన్ని అవకతవకలు జరిగినట్టు నిర్ధారించారు. ఇందుకు సంబంధించి సంబంధిత ఉపాధి గ్రామఫీల్డ్ అసిస్టెంట్ల నుంచి రూ.2.56 లక్షలు రికవరీ చేయాలని పీడీ నాగమల్లేశ్వరరావు ఆదేశించారు. అలాగే రూ.5.82 లక్షల విలువైన పనులపై మరోసారి విచారణ జరపాలని సూచించారు. కొన్ని గ్రామాల క్షేత్రస్థాయి ఉపాధిహామీ సిబ్బందిపై పలు ఆరోపణలు వచ్చాయి. ఆ పనులపై ప్రత్యేక అధికారితో విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాలని ఎంపీడీఓ శ్రీనివాస్‌కు పీడీ నాగమల్లేశ్వరరావు ఆదేశించారు. కార్యక్రమంలో ఏపీడీ బి. రాంప్రసాద్, విజిలెన్స్ అధికారి ఎస్. నరేష్, ఉపాధి హామీ, పంచాయతీ రాజ్ శాఖల సిబ్బంది, వివిధ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

టీచర్ విద్యార్థులను కొట్టిన ఘటనపై విచారణ

నిడదవోలు రూరల్: శెట్టిపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈనెల 25న విద్యార్థులను స్కూల్ టీచర్ కొట్టిన ఘటనపై ఎంఈఓ కేవీ గణేశ్ శనివారం పాఠశాలలో విచారణ జరిపారు. జిల్లా విద్యాశాఖాధికారి వాసుదేవ రావు ఆదేశాల మేరకు ఈ పాఠశాల విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులతో కూడా మాట్లాడినట్టు ఎంఈఓ గణేశ్ తెలిపారు. పూర్తి విచారణను ఉన్నతాధికారులకు నివేదిస్తానని చెప్పారు. ఈ విచారణలో హెచ్‌ఎం రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన

దేవరపల్లి: దేవీ నవరాత్రుల ముగింపు సందర్భంగా స్థానిక పల్లపు వీధి రామాలయం వద్ద శనివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ భారీ అన్న సమారాధన నిర్వహించారు. దాతల సహకారంతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్న సమారాధనకు దేవరపల్లి పరిసర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి అన్నప్రసాదం స్వీకరించారు.

క్రీడా వికాస కేంద్రం పురోగతికి చర్యలు

జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి శేషగిరి

సాక్షి ఇంపాక్ట్

దేవరపల్లి: స్థానిక ఏఎస్ఎన్ జెడ్పీ హైస్కూల్లో అసంపూర్తిగా ఉన్న క్రీడా వికాస కేంద్రం నిర్మాణ పురోగతికి చర్యలు తీసుకుంటున్నట్టు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి డీవీవీ శేషగిరి తెలిపారు. 'అసంపూర్తిగా క్రీడా వికాసం కేంద్రం' అనే శీర్షికన ఈ నెల 23న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి శేషగిరి శనివారం స్పందించారు. రూ.2 కోట్ల వ్యయంతో చేపట్టిన వికాస కేంద్రం పనులు 28 శాతం పూర్తయినట్టు తెలిపారు. నిలిచిపోయిన పనుల గురించి నివేదికను క్రీడల అభివృద్ధి సంస్థ ప్రధాన కేంద్రానికి పంపించినట్టు చెప్పారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ లోని ఇంజినీరింగ్ శాఖ ఆధ్వర్యంలో మిగిలిన నిర్మాణ పనులను పురోగతిలోకి తీసుకురావడానికి ప్రయత్నం జరుగుతోందన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలకు కసరత్తు

- ఓటర్ల జాబితాలు సిద్ధం చేస్తున్న అధికారులు
- తొమ్మిదేళ్ల తర్వాత ఎన్నికలు
- ఆయకట్టు రైతులందరికీ ఓటు హక్కు
- కొవ్వూరు డివిజన్‌లో 53 సాగునీటి సంఘాలు



దేవరపల్లి మండలం యర్నగూడెంలోని ఊర చెరువు

దేవరపల్లి: సాగునీటి సంఘాల ఎన్నికలకు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసింది. దీంతో సాగునీటి చెరువులు, కాలువల ఆయకట్టుదారుల్లో సందడి నెలకొంది. పదవుల కోసం కూటమి నాయకుల్లో పోటీ పెరుగుతోంది. ఈ ఎన్నికల్లో నైనా తమ అనుచరులకు పదవులు ఇప్పించుకోవాలని కూటమిలోని జనసేన నాయకులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఎన్నికల ప్రక్రియ నిర్వహణకు రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులు సన్నద్ధం అవుతున్నారు. తొలుత గ్రామాల్లోని సాగునీటి కాలువలు, చెరువుల కింద గల ఆయకట్టు భూముల సర్వే నంబర్లు, రైతుల వివరాలను ఇరిగేషన్ అధికారులు సేకరించి నమోదు చేస్తున్నారు. ఈ నెల 31 వరకూ ఆ వివరాలను సేకరించి తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తారు.

ఆయకట్టుదారులందరికీ ఓటు హక్కు

చెరువులు, కాలువల కింద భూములు గల సాగుదారులందరికీ ఓటు హక్కు ఉంటుంది. కనీసం సెంటు భూమి గల రైతు కూడా ఓటరుగా ఉంటాడు. మూడేళ్ల నీటితీరువా చెల్లించి ఉండాలి. అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడి పదవులకు ఎన్నిక జరుగుతుంది. చెరువుల నిర్వహణ, అభివృద్ధి, నీటి తీరువా వసూళ్ల వంటి బాధ్యతలు నీటి సంఘాలకు ఉంటుంది.

కొవ్వూరు డివిజన్‌లో 53 చెరువులు

కొవ్వూరు డివిజన్‌లోని గోపాలపురం, కొవ్వూరు, నిడదవోలు నియోజకవర్గాల పరిధిలో 53 మైనర్ ఇరిగేషన్ చెరువులున్నాయి.వాటిలో గోపాలపురం నియోజకవర్గంలో 23 చెరువులు ఉన్నాయి. మండలాలవారీగా దేవరపల్లిలో 5, గోపాలపురంలో 11, నల్లజర్లలో ఏడు మైనర్ ఇరిగేషన్ చెరువులు ఉన్నాయి. నిడదవోలు మండలంలో 6 చెరువులు ఉన్నాయి. ఇవిగాక నిడదవోలు, కొవ్వూరు నియోజకవర్గాల్లో సాగునీటి కాలువలు, ఎత్తిపోతల పథకాలు, గోదావరి డెల్టా, ఇతర కాలువలు ఉన్నాయి. వాటి ఎన్నికల నిర్వహణకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. సంఘాల పదవీకాలం ఐదేళ్లు ఉంటుంది. 2015లో సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరిగాయి. ఐదేళ్ల వరకూ మనుగడలో ఉన్నాయి. నోటిఫికేషన్ విడుదలైన 40 రోజుల్లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తవుతుంది.

వివరాలు సేకరిస్తున్నాం

మైనర్ ఇరిగేషన్ చెరువుల కింద భూమి సాగుదారుల వివరాలు సేకరించి నమోదు చేస్తున్నాం. ఈ నెల 31 వరకూ ఆ వివరాలు సేకరించి తహసీల్దార్లకు అందజేస్తాం. రెవెన్యూ అధికారులు రైతుల జాబితాలను పరిశీలించి ఓటర్ల నమోదు చేస్తారు. ఆయకట్టు రైతులందరికీ ఓటు హక్కు ఉంటుంది. మూడేళ్ల నీటి తీరువా చెల్లించి ఉండాలి. గోపాలపురం, నిడదవోలు మండలాల్లో 29 మైనర్ ఇరిగేషన్ చెరువుల సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగే విధంగా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

– రాహుల్ భాస్కర్, ఏఈ, మైనర్ ఇరిగేషన్ శాఖ